బే

ర

ం



★

దొంగ :—ఓ అయ్యరూ, జేబులోని రూపాయలు మర్యాదగా యియ్యి, లేకపోతే చంపేస్తా.

అయ్యరు :—ఓ, భేషుగ్గా ; ఆక్షేపణే ముందీ ! కాని పర్సులో రూపాయ ల్లేవు, నోట్లేవున్నాయ్, మార్చి నీక్కావలసింది తీసుకుని మిగతాది యిస్తావా ?

★

మేం ఇద్దరమూ ఒకే ప్రమాదానికి గురిఅయ్యాం....కాని

అతనిపేరు చచ్చినవాళ్ళల్లో జేర్చ బడి....మా దెబ్బలు తిన్నవాళ్ళని వెక్క రిస్తూనేవుంది....

మా హృదయాల్లో ఉన్న ప్రతీ ఎము కనీ, అతని కడాపటిచూపు....వెతు కుతూ....వెర్రెత్తిస్తోంది.

# అంత్యదృష్టి

శ్రీ కె. లింగరాజు

నా ఎడంచెయ్యివిరిగి, ఇంకామూలుగుతూనే వుంది. ప్రతీకన్నంలోనూవున్న నిశ్శబ్ద అంతర్వాహినులను కదిపి తొణికించి ఏడిపిస్తోంది. పైనున్న ప్లాస్టర్ ఆవ్ పారిస్ పట్టి తెల్లగా, బిగుసుగుపోయి, ఏరులో మునిగిపోయి బైటికి రానన్న రైలుపెట్టిలాగానే చేతి ఎముకను సావు చేసి తిన్నగా అతుకిస్తానని కేరింతాలుకొట్టుతోంది.

ఇవన్నీ ఎదురుగా కళ్ళకి కనిపిస్తున్నా, వల్ల గుడ్డు రంధ్రంలోంచి రెటీనామీదపడి ప్రతిబింబి స్తున్నా, ఆరాత్రి, — ఆరోతారీఖు కాళరాత్రి —మరుపు రానివ్వకుండాను, ఆ మరణవేదనలు నరకగగ్గోలు, హృదయ విదారక దృశ్యాలు, దృక్పథంలోంచి హృదయాంతరాళంలోంచి తోలెయ్యలేకుండావుంది.

ఆదృశ్యాలు, ఆ మృత్యుదేవత మెరుపు నృత్యాలు ఎదురుగా కన్పడుతూనే వున్నాయి. నా గుండెల్ని పిండిచేసేస్తూనే వున్నాయి. దాన్ని ఎంత ప్రయత్నించి తెరవెనకకు నెట్టలేక ; చూడలేక, తోసివేద్దామన్నా, దోబూచులాడే పిల్లాడిలాగే, ఓసారి మనకతెరలోకి వెళ్ళి, మళ్ళా పూర్ణబింబ ప్రదర్శనం చేస్తూనేవుంది.

అంతమంది గుండెలదరిపోయే కేకల్తోటీ, ప్రాణాన్నిఎల్లాగైనా రక్షించుకొందామన్న ఆతృత తోటీ,భీబత్సంలో చిక్కి దారితెన్నూ తెలియక, భీతహరిణాల్లా ఇటుఅటూ పరిగెత్తి మృత్యు ఎన్నో........

ఇంజను, దాంతర్వాత కొన్నిపెట్టెలు.... వరసాగ్గా, ఆవాగుమీద బ్రిడ్జీ....ఆక్రిందమట్టి కోసి వేయబడి పయోముఖవిషకుంభంలా వున్న ....ఆ మృత్యుదేవత చెలికాంద్రయిన ఇనుప పట్టాలు........

తర్వాత జరిగి ప్రళయం .... కలియు గాంతం.....బాంబుల వర్షం........

ఫెళఫెళ ధ్వనులు ....ఆర్తనాదాలు....ఇంకా ఎన్నో....

ఇవన్నీ గుండెల్లో పరిగెత్తుతూనే వున్నాయి. నా ఈ రెండుకళ్ళతోనూ చూచి ఆదృశ్యాన్ని మరీ మరీ దృక్పథంలోకి తెస్తూ తూట్లు పరుస్తున్నాయి....

అన్నిటికంటె....

అతడు....అతని మరణం....

దహించేస్తోంది .... హృదయంలోని రక్తం అంతా నీటిక్రింద తోడేస్తుందా అన్నట్లుగా కల చేస్తోంది....

*  *  *

ప్లాట్ఫారంమీద....

అతనెవరో నాకు తెలియదు .... నేనెవరో అనితకే తెలియదు....మా ఏలూరుబండి ముందుగా బండిలో మంచి బెర్త్ ఆక్రమించుకొన్నాను.

మంచిది, విశాలంగా, శుభ్రంగావున్న బోగీ లోనే కుదిరిందని సామాను పక్కన నవ్వింది. కొన్నివత్సరాలనుంచి చదువుయెడ విముఖతతో, సగం బి. ఏ. డిగ్రీతోకూర్చున్న నాకు 'కేంటీన్ కోర్' లో ఉద్యోగం దొరకడంతోటే వివశత చెందిన శరీరం ఓసారి ఎగిరి కిందనే పడింది. పైనున్న పంకా, క్రిందనున్న మెత్తటిపరుపు, డాగురంగు చట్టా, ఎలక్ట్రిక్ స్విచ్చితోనూ తన సంతోషం అందిచ్చేసి కుయుక్కుమనేసింది.

దర్జాగా అందులోనూ సెకండుక్లాసు ప్రయాణీ కుణ్ణికూడాను, కంపార్టుమెంటు గుమ్మంలో ఆవ్ సూటుతోనుంచుని అటూ ఇటూ తిరిగే ప్రయా ణీకులు, నీలిచొక్కాల్లో ఎర్రపాగాల్లో ఉన్న కూలీ లనీ, వారు మోసే సామాన్లనీ, అక్కడక్కడగా తిరిగే ఆంగ్లోఇండియన్ జంటల్ని, నోట్లో ఓపైపు పెట్టుకొని తిరిగే సైనికుల్నిచూస్తూ వుంటంలో మునిగిపోయేను.

కంగారు కంగారుగా—టైములేదు, మూడో ఘంటకొట్టేస్తారు అన్న తొందరతో అతనువచ్చి, 'ఇందులోపెట్టు సామాను' అని కూలీకిచెప్పి తాను ప్రక్కకి తప్పుకొన్నాడు.

అతని గాడిదబరువు సామానంతా పైకెక్కి

పొర్లుదు.—చేతిలో పావులా పడితే వండి పోయిన పండులాగే పళ్ళికిలించి వెళ్ళిపోయేడు.

నా 'లోవర్ బెర్తు'కు ఏదురుగానే కోటువిప్పి, హోల్డాలుబెల్టు లూడదియ్యడానికి అతడు ఉప క్రమించేడు. పైనపెట్టిన పెద్ద లాకాలేజీ ట్రంకులు రెండు, డ్రెస్‌బాక్సు పళ్ళబుట్ట' ఇవన్నీ 'మేం మీదపడిపోతాం ఎప్పుడోఅప్పుడు' అన్నట్లుగానే ఉరిమిచూస్తున్నాయి.

అతనూ సర్దుకు కూర్చొనేటప్పటికి, ఎదురుగా ఇండియన్ రిఫ్రెష్‌మెంటుస్టాల్లో గడియారం అరఘంటా కొట్టడం, ఇటు మూడోఘంట కొట్టడం రెండూ ఓసారే జరిగేయి. నెమ్మదిగా ఓసారి ఇంజెను కూతవేసి బయల్దేరింది ; తన దూర ప్రయాణానికి పైనున్న హెడ్‌లైటు చీకటిని తరి మేస్తుంటే....

'ఎక్కడికి వెడుతున్నారండి?'

నేను అనుకోనైనాలేదు అతడా ప్రశ్న వేస్తా డని....

చెప్పేను.

'నేనూ ఆ ప్రాంతానికే వస్తున్నానండి.... సెలవుమీద ఈ ప్రాంతాలకి వచ్చేను....ఎల్లుండి డ్యూటీలో జాయిన్ అవ్వాలి !'

'అల్లాగా....ఆపట్నాల్లో 'రైస్' గొడవలు ఎల్లావున్నాయండి ?....'

తర్వాత యాధాలోపంగానే అన్నికబుర్లూ మాట్లాడుకొన్నాం. అందులో రాజకీయాలు, చరిత్రలు, స్టూడెంటు డేస్, సినిమాస్టార్స్.... ఒకటేమిటి అన్నీదొర్లిపోయేయి....

అంత త్వరలో—కొద్దినిమిషాల కాలంలో ఎప్పటినుండో, ఎన్నో ఏళ్ళనుండో పరిచయం, స్నేహం, ఉన్న వాళ్ళకి మల్లే అయిపోతాం ఈ రైలుప్రయాణాల్లో అనుకొన్నా....

'ఇంకా నిద్ర రావటంలేదు కాబోలు మీకు.... పోని కాస్త ఓవల్‌టిన్ త్రాగుతారా ?....' అంటూనే ఆయన ఫ్లాస్కులోది తియ్యడం, కప్పులో పొయ్యడం....జరిగేయి.

తర్వాత మూడైదులు మా ఇద్దరిమధ్యా ముద్దులాడుకొన్నాయి.

'నాకు నిన్నరాత్రి నిద్ర లేదండి....కాస్సేపు నడుంవాలుస్తా' నంటూనే వాలి ఆ రంగు రంగుల సీతాకోకచిలకల దుప్పటీ కప్పుకొన్నాడు.... ఇటు చూస్తూ పడుకుంటే కళ్ళల్లోకి టార్చిలైట్లల్లా పడుతుంది పైనున్న బ్లాకవుట్ లైటని అటు తిరిగేడు....

ఆ నిశ్శబ్దంలో అతని ముఖం ఎందుకో తెలియకుండా, మళ్ళా .... మళ్ళా .... తలంపుకు వచ్చింది. ప్లేటుమీద అచ్చొత్తిపోయినట్లుగా నా మెదడులో గుద్దుకుపోయింది.....

ఆ ఎగదువ్విక్రాపింగు, చెవులమధ్యవరకూ బాక్సు, నల్లగా లోతుగావున్న కనుగుంటలు, కొంచెం ముందెత్తుగానున్న ముక్కు, ఆ కోల ముఖం....ఇవన్నీ . దేన్నో విపరీతభావాన్ని

ఈతన్ని గురించి ఆలోచించినకొద్దీ అవ్యాజ మైన ప్రేమ ఉబుకొ్కనివస్తూ హృదయాన్ని ఆత్రపరుస్తూనేవుంది. .... ఎందుకో . ఈ ఆత్ర పడ్డం అని అంతన్ను విస్మయపడుతూనే వుంది....

ఆ మగతఆలోచనల్లో నాకు గోరుకునుకు వచ్చినట్లుగా అయ్యింది.

పైన వర్షం జల్లు కొడుతూనేవుంది....అక్క డక్కడ తెలతెల్లగావున్న అవకాశాన్ని మబ్బులు కప్పేస్తున్నయి....

పహరాలేనిచోట పహారా వచ్చినట్లుగా ఈదరి గాలి కృష్ణను అదిరించి వచ్చినట్లుగానే వీస్తోంది.... అక్కడక్కడగా....'అర్జునః ఫల్గుణం' అని మంత్రాన్ని ముసలమ్మలు చదివేటట్టుగా ఆకాశం రోదనచేస్తోంది....

పైనున్న ఈదురగాలిచప్పుడుతో, రైలు బద్దీలమీద చక్రాల వక్రపుధ్వని కలిసిన స్వర మేళం, నాహృదయానికి ఏదో యమఘంటికా నాదాల్లా స్ఫురించింది....?....

అటు మగత పూర్తిగా ఆక్రమించింది....

ఇంతట్లోకే....

పైబెర్తులోవున్న వ్యక్తి నా extended bed మీదనున్న నాపై పడిపోయేడు....ట్రెయినంతా ఇటూ అటూ కదిలిపోయి....ఏ భూకంపాన్నో జ్ఞప్తికితెచ్చేసింది....ఒక్కటే గోలగా, పూళ్ళ పూళ్ళు తగలబడ్డట్టుగా శబ్దాలు....నీటిమీద చుయ్యి అని చప్పుడు... లొడలొడ మని నీళ్ళు కలయిక....అక్కడక్కడ....ఎన్నో....

నా తల ఓసారి భూపరిభ్రమణం చేసింది....నా గుండెలు విమానవేగాల్తో పరిగెత్తేయి....

నాచెయ్యి....సూటుకేసు మీదపెట్టుకొని పడు కొన్నానేమో ఎత్తుపల్లాల్లోవున్న దానిమీద బరువు పడ్డంవల్ల విరిగిపోయింది....

లోపల యమబాధగావుంది....

ఎదురుగా చూచేను....ఆ రెండు ట్రంకులు, బుట్ట, డ్రస్సుబాక్సు అతన్ని కప్పేసేయి....అతను బ్రతికివున్నాడేమో....లేదో....అని

ఆ బాధతోనే, తక్కిన వాళ్ళ సహాయంతో... వెళ్ళి తీసేను....

స్పృహతప్పిపడిపోయినట్లుగావుంది...కోసుగా వున్న పెట్టికోణం నుదిటిలో గుచ్చుకుపోవడం వల్ల రక్తం కారిపోతూనేవుంది....

అప్పటికి పైనున్న మృత్యుదేవత ఆరాటాలు ....ఇంకా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వున్నయి....

ఆతను ఏదో ప్రపంచంలోకి వెళ్ళి వచ్చినట్టుగా కదలి .... ఒక్కసారిగా .... కళ్ళుతెరచి....కెవ్వు మనికేకవేసి కళ్ళు మూసేసుకొన్నాడు....

మాది ఆఖరి బోగీ అవడంవల్ల అంతగా ప్రమాదం జరగలేదు ...పక్కగా తలుపులలోంచి ఏటినీరు కన్పిస్తూనేవుంది....

తిరిగి చూచేడు....

'బాబోయి !....' హృదయాలు పగిలేటట్టు కేకవేసి కూలిపోయేడు.

ఆ కళ్ళని బలహీనత చేతుల్తోనే గుచ్చు కొంటూ....ఆ రక్తపు తాంబులరాగ హస్తాల్తో మూసుకొంటూ....

'గుండెలు .... ఎముకలు .... మాంసం .... గొణిగేడు.

మా ముగ్గురికి గుండెలు చేతుల్లోకేవచ్చేయి.

తిరిగి ఆ సందుల్లోనుంచి చూడ్డానికి....చూడ లేక లేచినుంచుని....వెళ్ళేడు....

ఆతని ముఖంలో భయంతో భేజారైపోయి పరిసరాలు తెలియనట్టుగానే అయిన వ్యక్తిలా అయ్యేడు....ముఖం అంతా రక్తంతో తడిసి.... వికృతంగా....భీకరంగా....

'అబ్బా .... మీ మొఖాలు కన్పట్టంలేదు.... అందులో ఏముకలు.... మీ అస్థిపంజరం.... అంతా .... అదిగో .... అదిగో ....' గోలెత్తి నట్టుగానే....

మేం అనుకోలేదు....

ఆ బాధ భరించలేక అంతపని చేస్తాడని....

మాకు తెలియకుండానే...ఆ ఏరులోదూకేసేడు.

వరదలుగా పారుతున్న ప్రవాహంలో ఓసారి భుడుంగుమన్న శబ్దం వినిపించింది....

తిరిగి ప్రవాహం తనపని తాను నిర్వహిస్తూనే వుంది.

పరిసరాల్లో .... అణగిపోయిన మృత్యువు ఘుమ్మల్ని రేకొట్టింది.

* * *

ఆ స్టేషను ప్రక్కగా—చనిపోయిన వారి పేర్ల పట్టిక వెళ్ళాడుతూనేవుంది....

చచ్చిపోయిన వారిలో ఆతనిపేరు, వయస్సు, వేసి అందరికళ్ళకి చూపడేటట్టు రాసేవుంది.

కాని....

నాపేరు ఏమూలో గాయపడిన వారి పట్టీలో వేళ్లాడుతోంది....